# నమస్తే తెలంగాణ
# నాగర్‌కర్నూల్




కేటీఆర్‌ను కలిసిన నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు

## కేటీఆర్‌ను కలిసిన రంజిత్‌కుమార్

గద్వాల అర్బన్, ఆగస్టు 14 : పార్టీలో చేరిన నాయకులకు సముచిత స్థానం కల్పిస్తామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బుధవారం మాజీ మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్, ఆయన అనుచరులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ గద్వాల రాజకీయ పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు గద్వాలలో బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చే విధంగా కృషి చేస్తామని ప్రకటించారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రంగం జైపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


తెలంగాణ భవన్‌లో బుధవారం బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉండి మృతి చెందిన గద్వాల, అలంపూర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట నియోజకవర్గ కార్యకర్తల కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్స్ సాంక్షన్ ఆర్డర్ కాపీలను అందజేస్తున్న పార్టీ జనరల్ సెక్రటరీ సోమ భరత్‌కుమార్

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు

పెబ్బేరు, ఆగస్టు 14 : రైతు సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తున్నదని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నా రు. బుధవారం శ్రీరంగాపురంలోని రంగసముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా మంత్రి సాగునీటి ని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలోనూ కాంగ్రెస్ హయాంలోనే రైతులకు మేలు జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.


రంగసముద్రం వద్ద పూజలు చేస్తున్న ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు

## రైతులకు తప్పని కష్టాలు


- బ్యాంకుల ఎదుట పడిగాపులు

కల్వకుర్తి, ఆగస్టు 14 : ఇచ్చే వాడికి తీసుకునేవాడు లోకువ అనే నానుడి బ్యాంకుల ముందు కష్టాలు పడుతున్న రైతులకు అతికినట్లు సరిపోతుంది. ప్రభుత్వం వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తుందని తేదీలు ప్రకటించిన నాటినుంచి రైతులు తాము అప్పులు తీసుకున్న బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. గందరగోళ పరిస్థితులు ఉండగా తమ రుణా లు మాఫీ అయ్యాయా.. లేదా అంటూ బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రు ణమాఫీ అయిన వారు కొత్త రుణాల కోసం, రుణమాఫీ కానివారు ఎందుకు మాఫీ కాలేదని తెలుసుకునేందుకు, ప్రభుత్వం రైతుబంధు ఇవ్వకపోవడంతో పెట్టుబడుల కోసం తాళిబొట్లను బ్యాంకుల్లో కు దువ పెట్టేందుకు రైతులు బ్యాంకుల వద్ద తచ్చాడుతున్నారు. రైతులు ఉదయం 9గంటల వరకే బ్యాంకుల వద్దకు వచ్చి లైన్‌లో నిలబడుతున్నారు. పూర్తిస్థాయిలో రుణ మాఫీ అమలై కొత్త రుణాలు రాక, పెట్టుబడి సాయం (రైతుబంధు) ఊసే లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు తమ విధి రాతను నిందించుకుంటున్నారు. పాలిచ్చే బర్రెను వదులుకొని తన్నే దున్నపోతును తెచ్చుకున్నట్లైందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి రైతులు శాపనార్థాలు పెడుతున్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చినట్లు రైతుబంధు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


కల్వకుర్తిలోని ఎస్‌బీఐ వద్ద బారులుదీరిన రైతులు

## వన్యప్రాణుల సంరక్షణకు కృషిచేద్దాం

- సీసీఎఫ్ శివానిదోగ్రా


అడవిని పరిశీలిస్తున్న సీసీఎఫ్ శివానిదోగ్రా

లింగాల, ఆగస్టు 14 : వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని సీసీఎఫ్ శివానిదోగ్రా అన్నారు. బుధవారం మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో నిర్మించిన భౌరమ్మ వాచ్‌టవర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీఎఫ్ శివాని దోగ్రా మాట్లాడుతూ అడవిలో మొక్కలు నాటి ఏపుగా పెంచడం వల్ల వాతావరణ కాలుష్య నివారించడంతోపాటు వర్షాలు సమృద్ధిగా పడుతాయన్నారు. అడవిని నాశనం చేయడం వల్ల మానవ జాతి మనుగడకు ముప్పు వాటిల్లుతుందని గుర్తు చేశారు. మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో నిర్మించిన భౌరమ్మ వాచ్‌టవర్ దాదాపు 15వందల అడుగుల ఎత్తులో ఉందని అడవిలో స్మగ్లర్లు చొరబడితే వెంటనే గుర్తించవచ్చని అన్నారు. వన్యప్రాణులను వేటాడడం చట్టరీత్యా నేరమని, జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లింగాల, అచ్చంపేట ఎఫ్‌డీవోలు రామ్మోహన్‌రావు, తిరుమల్‌రావు, ఎఫ్‌ఎస్పీ ఎఫ్ఆర్‌వో ఎంఏ సుబుర్, డీఆర్‌వో జయదేవ్, ఫారెస్ట్ అధికారులు ఖాదర్ పాషా, శివాజీ తదితరులు ఉన్నారు.


దేవరకద్ర మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన ఉల్లి

## ఉల్లి ధరలు పైపైకి..

- వారం వ్యవధిలో రూ.600 పెరిగిన క్వింటా ధర
- గరిష్ఠంగా రూ.3,910, కనిష్ఠంగా రూ.2,810

దేవరకద్ర, ఆగస్టు 14 : ఉల్లిధరలు దడ పుట్టిస్తున్నాయి. రోజురోజుకూ ధరలు పెరుగుతున్నాయి. బుధవారం దేవరకద్ర మార్కెట్‌కు భారీగా ఉల్లిని రైతులు తీసుకొచ్చారు. దాదాపు 64 క్వింటాళ్లు విక్రయానికి రాగా స్థానిక వ్యాపారులతోపాటు బయటి నుంచి వచ్చిన వారు టెండర్లు వేశారు. గత వారం కంటే ఈసారి క్వింటాకు రూ.600 ధర పెరిగింది. గరిష్ఠంగా రూ.3,910 ధర పలకగా.. కనిష్ఠంగా రూ.2,810 లభించింది. మార్కెట్ నిబంధనల మేరకు 45 కిలోలు తూకం వేసి విక్రయించారు. ప్రస్తుతం ఉల్లి ఉత్పత్తి లేదు. దీంతో మార్కెట్‌లో గత వారం ధర రూ.3,300 ఉండగా ఈసారి పెరిగిందని వ్యాపారులు తెలిపారు. ధర పెరగగా ఉల్లి రైతులు హర్షం వ్యక్తం చేస్తుండగా.. పేద, మధ్య తరగతివాసులు ఆందోళన చెందుతున్నారు.

### వనపర్తి జిల్లాలో కొత్తగా మరో 7 పంచాయతీలు

కేసీఆర్ ప్రభుత్వంలోనే కొత్త గ్రామ పంచాయతీలకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా అప్పటి గవర్నర్ ఫైల్‌ను పెండింగ్‌లో ఉంచారు. ఇప్పుడు అవే ప్రతిపాదనలను కొత్త ప్రభుత్వం ముందుకు తీసుకుపోవడంతో ఇటీవలే నూతన గవర్నర్ ఆమోదముద్ర వేశారు. దీంతో జిల్లాలోని గోపాల్‌పేట మండలంలోని జింకలబండతండా, లక్ష్మీదేవిపల్లి, ఖిల్లాఘణపురం మండలం ముందరితండా, వసురాంతండా, కొత్తకోట మండలం పాతజంగమాయిపల్లి, వడ్డేవాటతండా, పెద్దమందడి మండలం నాగుల్‌కుంటతండాలు కొత్త పంచాయతీలుగా ఏర్పాటయ్యాయి. దీంతో ఆయా గ్రామాల వాసులు హర్షం వ్యక్తం చేశారు.


కొత్తకోట మండలం పాత జంగమాయపల్లి గ్రామం

# నిధుల కొరత!

- వనపర్తి జిల్లాలో రూ.10 కోట్లకుపైగా బకాయి
- చాలీచాలని నిధుల విడుదలతో తప్పని కష్టాలు
- ఎక్కడికక్కడే నిలిచిన అభివృద్ధి పనులు
- అస్తవ్యస్తంగా మారిన గ్రామ పంచాయతీలు
- అరకొర నిధులతో కొరవడిన పారిశుద్ధ్యం

**వనపర్తి జిల్లా జీపీల్లో చేసిన పనుల బకాయిల వివరాలు**

| మండలం | పెండింగ్‌డబ్బులు |
|---|---|
| అమరచింత | 24,03,832 |
| ఆత్మకూరు | 41,95,854 |
| చిన్నంబావి | 21,28,202 |
| ఖిల్లాఘణపురం | 1,73,34,778 |
| గోపాల్‌పేట | 76,22,907 |
| కొత్తకోట | 63,04,911 |
| మదనాపురం | 24,02,867 |
| పాన్‌గల్ | 1,30,58,013 |
| పెబ్బేరు | 1,14,29,847 |
| పెద్దమందడి | 1,00,30,152 |
| రేవల్లి | 56,79,377 |
| శ్రీరంగాపురం | 50,23,965 |
| వనపర్తి | 39,22,580 |
| వీపనగండ్ల | 17,74,397 |
| మొత్తం | 9,33,11,682 |

వనపర్తి, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ) : పల్లెలే దేశానికి పట్టుగొమ్మలని, అవి అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందినట్లు అని అనేక మంది మహనీయులు చెబుతున్నారు. ముఖ్యంగా గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించేందుకు తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం కృషి చేసింది. గ్రామాలకు పూర్తిగా మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించింది. ప్రస్తుతం ఎనిమిది నెలలుగా గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం ముగిసి ప్రత్యేక అధికారుల పాలన సాగుతున్నది. ఇక నిధుల విషయంలోనూ గ్రామ పంచాయతీలను ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో గ్రామీణ వ్యవస్థ పూర్తిగా గాడితప్పింది.

**ఫాగింగ్ యంత్రాలు మూలకు..**

గ్రామ పంచాయతీలను నిధుల కొరత వేధిస్తున్నది. అభివృద్ధి సంగతి అటుంచితే.. కనీసం ట్రాక్టర్ మెయింటనెన్స్‌లాంటి పనులకు కూడా తీవ్ర ఆటంకం కలుగుతున్నది. చాలా గ్రామ పంచాయతీల్లో ఆర్థిక సమస్య కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఓ పైపు వేయాలన్నా.. మోటరు కాలిపోతే రిపేరు చేయాలన్నా కష్టతరమవుతున్నది. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలుండగా 45 జీపీల్లో మాత్రం కొన్ని డబ్బులు ఉన్నప్పటికీ మరో 210 జీపీల్లో ఎందుకు కొరగాని విధంగా నిధులున్నాయి. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోగా, అభివృద్ధి పనులవైపు కన్నెత్తి చూసే పరిస్థితులు లేవు. వర్షాకాల సీజన్‌లో కనీసం ఒక్కసారైనా ఫాగింగ్ చేసే పరిస్థితులు గ్రామ పంచాయతీల్లో కానరావడం లేదు. అన్ని యంత్రాలు మూలకు చేరడంతో వాటి దుమ్ము కూడా దులిపే పరిస్థితి లేదు.

**కార్యదర్శులకు తప్పని కష్టాలు**

గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం ముగిసిన అనంతరం ఆ బాధ్యతలన్నీ పంచాయతీ కార్యదర్శి భుజాలపై పడ్డాయి. అంతకుముందు ఏ సమస్య వచ్చినా సర్పంచ్ మెడకు చుట్టుకునేది. ఇక రెండు బాధ్యతలను కార్యదర్శి నిర్వహించాల్సి రావడంతో కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 8నెలలుగా గ్రామాల్లో ఆర్థికపరమైన సమస్యలు కూడా కార్యదర్శులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ట్రాక్టర్లను మెయింటనెన్స్ చేయ డం నుంచి వీధిలైట్ల వరకు ఏ చిన్న అవసరం వచ్చినా కార్యదర్శులే బాధ్యత తీసుకోవాలి. ఇటీవలే చేతి నుంచి డబ్బులు పెట్టుకున్న కార్యదర్శులంతా బదిలీల్లో మారిపోయారు. వారు ఖర్చు పెట్టిన డబ్బులు తీసుకోవాలంటే తలప్రాణం తోకకు వచ్చేలా ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**రూ.10 కోట్ల బకాయిలు**

జిల్లాలోని గ్రామపంచాయతీల్లో చేసిన పనులకు దాదాపు రూ.10 కోట్ల బకాయిలున్నాయి. గ్రామాల్లో వివిధ శాఖల ద్వారా అనేక అభివృద్ధి పనులు సర్పంచుల ఆధ్వర్యంలోనే చేపట్టారు. ఒక్కో సర్పంచుకు రూ.లక్ష నుంచి రూ.40 లక్షల వరకు చేసిన పనుల బిల్లులు పెండింగ్‌లో ఉండి ఇరుక్కుపోయారు. గ్రామ పంచాయతీల్లో మూడు నెలల కిందటి వరకు పారిశుధ్య కార్మికులకే వేతనాలు చెల్లించేందుకు డబ్బులు లేని పరిస్థితి. కార్మికులకు కొంత ఉపశమనం కలిగినా సర్పంచులు చేసిన పనులకు మాత్రం నిధులు విడుదల కావడం లేదు.

**కేంద్రం నుంచి రూ.3.62 కోట్లు విడుదల**

గ్రామ పంచాయతీల్లో ఆర్థిక సమస్యలు పెరిగిపోతున్న క్రమంలో ప్రభుత్వం ఎట్టకేలకు అరకొరగా నిధుల విడుదలకు శ్రీకారం చుట్టింది. కేంద్రం జీపీలకు ఇచ్చిన రూ.220 కోట్లను రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ ఇటీవల జీపీలకు విడుదల చేసింది. వీటిలో వనపర్తి జిల్లాకు రూ.3.62 కోట్లు వచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు వచ్చిన నిధులు ఏ మూలకు కూడా సరిపోవు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఒక్కరూపాయి ఇవ్వకుండా కేవలం కేంద్ర నిధులను మాత్రం కొంత మేర విడుదల చేసి చేతులు దులుపుకొంది. దీంతో తాజా మాజీ సర్పంచులంతా ఆవేదన చెందుతున్నారు.

పక్క ఫొటోలో ఉన్నది.. చిన్నంబావి మండలం చెల్లెపాడు గ్రామ పంచాయతీ ట్రాక్టర్. బ్యాటరీ చెడిపోవడంతో ఏడు నెలలుగా కదలడం లేదు. దీంతోపాటు చిన్న.. చిన్న మరమ్మతులు చేయాల్సి ఉన్నది. వీటిని సరిచేసేందుకు జీపీలో నిధులు లేవు. చేసేది లేక ఉన్న దాంట్లో కార్మికుల వేతనాలు, చిన్న పనులతో నెట్టుకొస్తున్నారు. ప్రస్తుతం రూ.20 వేలు మాత్రమే ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి 8 నెలలుగా ఒక్క రూపాయి కూడా రాలేదు. గత్యంతరం లేకపోడంతో మరమ్మతులకు నోచుకోకుండా ట్రాక్టర్ మూలకు పడింది. ఇద్దరు కార్మికులు పని చేస్తుండగా, రిక్షాలతో చెత్త సేకరణ చేస్తున్నారు.




వనపర్తి : వైద్యులపై దాడులకు నిరసనగా ఆందోళన చేస్తున్న ప్రభుత్వ వైద్యులు

## వైద్యులకు రక్షణ కల్పించాలి

- వనపర్తిలో ప్రభుత్వ డాక్టర్ల డిమాండ్

వనపర్తి, ఆగస్టు 14(నమస్తే తెలంగాణ) : వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్యులపై జరుగుతున్న ఆగడాలకు నిరసనగా వనపర్తి జిల్లా కేంద్రంలోని దవాఖానలో వైద్యులు బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్ఎంవో శివప్రసాద్ మాట్లాడుతూ సభ్యసమాజం తలదించుకునేలా కోల్‌కత్తాలో వైద్యురాలిపై జరిగిన ఘటన ఉదాహరణగా నిలుస్తుందన్నారు. ఈ ఒక్క ఘటనే కాకుండా వివిధ ప్రాంతాల్లోనూ వైద్యులపై దాడులు జరుగుతున్నాయన్నారు. దవాఖానల్లో పూర్తిస్థాయిలో వై ద్యులు లేకున్నా డబుల్ డ్యూటీ లు వేసుకొని విధులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కల్గించకూడదన్న ఉద్దేశంతోనే తక్కువమంది డాక్టర్లున్నప్పటికీ చికిత్సలు అందిస్తున్నారన్నారు. వైద్యవృత్తిని మానవతా దృక్పథంతో చూడాలని, అలాంటి వారిపట్ల మృగాలకంటే దారుణంగా మనుషులు వ్యవహరించడం అత్యం త ఘోరమని పేర్కొన్నారు. కోల్‌కత్తాలో జరిగిన ఘటనలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని, వైద్యులకు రక్షణ కల్పించాలని డి మాండ్ చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రం గారావు, డాక్టర్లు మనీషా, అరుణ ఉన్నారు.

## కార్యకర్తలూ.. ధైర్యంగా ఉండాలి : ఆల


కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్, ఆగస్టు 14 : బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మద్దిగట్ల గ్రామంలో మాజీ ఉపసర్పంచ్ నర్సింహారెడ్డి ఇంట్లో ప్రత్యేకంగా కార్యకర్తలను కలిశారు. ఈ సందర్భంగా ఆల మాట్లాడుతూ త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని, కార్యకర్తలంతా సమన్వయంతో పార్టీని బలోపేతం చేయాలని కోరారు. పార్టీ బలంగా ఉంటేనే నాయకులు గెలిచేందుకు అవకాశం ఉంటుందన్నారు. గ్రామాల్లో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి కర్రుకాల్చి వాతపెట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు బాలకోటి, రామకృష్ణ, అజీజ్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, సత్తూర్ నారాయణగౌడ్, చెన్నయ్య, గడ్డం రాములు ఉన్నారు.